https://epaper.manasamajam.com Contact No. 9989788438, 9505485656

# మన సమాజం

తెలుగు డిజిటల్ దిన పత్రిక

Truth towards the Society

చైర్మెన్ : పార్వతి సురేష్ కుమార్ ఎడిటర్ : పార్వతి రాజేష్ కుమార్

సంపుటి : 02 సంచిక : 81 సోమవారం 27-07-2026 పేజీలు : 4

రిపోర్టర్స్ కావలెను

మన సమాజం
Truth towards the Society

మన సమాజం తెలుగు డిజిటల్ దినపత్రికలో
నిఖార్సైన జర్నలిస్టుగా నిలబడాలనుకుంటున్నారా?
అన్ని తరహా వార్తలు, కథనాలు ఎలాంటి ఆంక్షలు లేకుండా రాయాలని కోరుకుంటున్నారా?
తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాలల్లో పనిచేసేందుకు విలేఖరులు కావలెను...
మీ కలాలకు పదును పెట్టండి.
సంప్రదించవలసిన నెంబర్లు
9989788438, 9505485656.

## పరీక్షా విధానంలో సంస్కరణలకు..

### హైపవర్డ్ టాస్క్‌ఫోర్స్

**నందన్ నిలేకణి నేతృత్వంలో ఏర్పాటు.. ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటన**

**టాస్క్‌ఫోర్స్‌లో ఇస్రో మాజీ చీఫ్ సోమనాథ్ సహా ఐదుగురు సభ్యులు**

**దెబ్బతిన్న మోదీ ఇమేజ్‌ను బాగు చేసుకునే హైపవర్డ్ యత్నమిది: కాంగ్రెస్**



**న్యూఢిల్లీ, జూలై 26:**
పదేపదే ప్రశ్నపత్రాలు లీక్ అవుతుండడంపై విద్యార్థి లోకం గళమెత్తుతుండడంతో.. పరీక్షా విధానంలో సంస్కరణల దిశగా కేంద్రం కీలక ముందడుగు వేసింది. ఇన్ఫోసిస్ సహవ్యవస్థాపకుడు, ఆధార్ రూపకర్త నందన్ నిలేకణి నేతృత్వంలో ఈ అంశంపై హైపవర్డ్ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం ఇన్‌స్టాగ్రామ్ వీడియో ద్వారా ఈ విషయాన్ని వెల్లడించారు. దేశ పరీక్షా వ్యవస్థను మరింత పారదర్శకంగా, విశ్వసనీయంగా, టెక్నాలజీ ఆధారిత వ్యవస్థగా మార్చడానికి తీసుకోవాల్సిన చర్యలను ఈ టాస్క్‌ఫోర్స్ సిఫారసు చేస్తుందని పేర్కొన్నారు. నీట్ పేపర్ లీక్ అనంతరం విద్యార్థుల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుందని గుర్తుచేసిన ప్రధాని.. సంస్కరణల ద్వారా పరీక్షా వ్యవస్థను మరింత బలోపేతం చేయడంపై దృష్టి సారిస్తామని చెప్పారు. "విద్యార్థుల సంక్షేమం కోసం భారత ప్రభుత్వం ఇప్పటికే పలు చర్యలు తీసుకుంది. స్టూడెంట్స్ భవిష్యత్తుతో ఆడుకున్నవారు ఇప్పటికే జైళ్లలో మగ్గుతున్నారు. ఇప్పటికే మేం ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేశాం. సోమవారం పార్లమెంటులో.. అత్యంత కఠినమైన నిబంధనలతో కొత్త చట్టం తెచ్చేందుకు సిద్ధమవుతున్నాం" అని మోదీ తాజా వీడియో సందేశంలో వివరించారు. ప్రభుత్వం తక్షణ చర్యల గురించి మాత్రమే కాకుండా.. దీర్ఘకాలంలో చేపట్టాల్సిన సంస్థాగత సంస్కరణల దిశగా కృషి చేస్తోందని చెప్పారు. "మనం భవిష్యత్తు గురించి కూడా ఆలోచించాలి. మన పరీక్షా వ్యవస్థ విశ్వసనీయంగా, పారదర్శకంగా ఉండాలి. టెక్నాలజీని గరిష్ఠంగా వినియోగించుకోవాలి. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుని.. అంతర్జాతీయంగా పేరొందిన సాంకేతిక నిపుణుడు నందన్ నిలేకనీ నేతృత్వంలో పరీక్షావిధానంలో సంస్కరణల నిమిత్తం ఒక హై-పవర్డ్ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలని మేం నిర్ణయించాం" అని మోదీ పేర్కొన్నారు. భవిష్యత్తులో నిర్వహించే పరీక్షల విశ్వసనీయతను మరింత మెరుగుపరచేందుకు.. ఆ టాస్క్‌ఫోర్స్ చేసే సిఫారసులను వీలైనంత త్వరగా అమలుచేస్తామన్నారు. కాగా.. మోదీ ప్రకటించిన హైపవర్డ్ టాస్క్‌ఫోర్స్‌పై కాంగ్రెస్ పార్టీ స్పందించింది.

## మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్‌తో కలిపే..

# యువతరం బిల్లు

**చట్టసభలకు పోటీ వయసు 21 ఏళ్లకు తగ్గించే అంశాన్నీ చేర్చండి**

**ప్రధాని మోదీకి సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదన**

**ఇప్పుడు 21 ఏళ్ల యువత ఐఏఎస్, ఐపీఎస్‌లు**

**అవుతున్నారు.. కంపెనీలనూ నడిపిస్తున్నారు**

**దేశ భవితనూ నిర్ణయించాలనుకుంటున్నారు**

**చట్టసభలకు పోటీ వయసును 21 ఏళ్లకు**

**తగ్గించే అంశంపై అసెంబ్లీలో తీర్మానం చేస్తాం**

**కేవలం నినాదాలతో దేశం అభివృద్ధి చెందదు**

**ప్రతిపక్షాలు, ప్రజల మాటను వినాలి**

**అలా చేయకనే 56 అంగుళాల ఛాతీ**

**యువత ముందు తలవంచాల్సి వచ్చింది**

**జాతీయ మీడియాతో ఇష్టాగోష్ఠిలో సీఎం రేవంత్**



**హైదరాబాద్, జూలై 26**
దేశంలో అసెంబ్లీలు, లోక్‌సభకు పోటీచేసే కనీస వయసును 21 ఏళ్లకు తగ్గించాలని.. ప్రస్తుత మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్ బిల్లులోనే ఈ అంశాన్నీ చేర్చాలని ప్రధాని మోదీకి సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదించారు. ఇప్పుడు 21 ఏళ్ల యువత ఐఏఎస్, ఐపీఎ?సలు అవుతున్నారని, పెద్ద కంపెనీలనూ నడుపుతున్నారని గుర్తు చేశారు. వారికి రాజకీయాల్లో ఎందుకు అవకాశం ఇవ్వకూడదని ప్రశ్నించారు. ఈ అంశంపై రాష్ట్ర శాసనసభలో తీర్మానం చేసి కేంద్రానికి పంపుతామని తెలిపారు. మహిళా రిజర్వేషన్, నియోజకవర్గాల పెంపు, పునర్విభజన, పోటీ వయసు 21 ఏళ్లకు తగ్గించడం.. ఈ నాలుగు అంశాలనూ ఒకే బిల్లులో చేర్చి పార్లమెంటులో సమగ్ర చర్చ చేపట్టాలని ప్రధాని మోదీని కోరారు. లేదా సంయుక్త పార్లమెంటరీ కమిటీ ఏర్పాటు చేసి, ఈ అంశాలపై అన్ని పార్టీల అభిప్రాయాలు తీసుకోవాలని.. నిపుణులు, సంబంధిత వర్గాలతోనూ చర్చించాల ని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం హైదరాబాద్ లోని తన నివాసంలో జాతీయ మీడియాతో మాట్లాడారు. దేశంలోని యువశక్తి ముందు 56 అంగుళాల ఛాతీ కూడా తలవంచాల్సి వచ్చిందని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఐదేళ్ల క్రితం రైతులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన మూడు నల్లచట్టాలను ప్రతిపక్షాలు తప్పుబట్టినా మోదీ వినలేదని.. ఆ చట్టాలను వెనక్కి తీసుకోవడమే కాకుండా రైతులకు క్షమాపణలు కూడా చెప్పాల్సి వస్తుందని ఏఐసీసీ అగ్రనేత రాహుల్ చెప్పారని గుర్తు చేశారు. తర్వాత రైతుల పోరాటంతో మోదీ సర్కారు సాగు చట్టాలను వెనక్కి తీసుకుని, రైతులకు క్షమాపణ చెప్పాల్సి వచ్చిందన్నారు.

మిగతా 4లో...

## ఇది నాకు కొత్త సబ్జెక్టు ప్రహ్లాద్ జోషి

విద్యాశాఖ మంత్రిగా బాధ్యతల స్వీకరణ



4 లో..

## గంగా నదిపై చికెన్ తినడం నేరమా?

అలా అని ఏ చట్టమూ చెప్పడం లేదే

సుప్రీంకోర్టు జస్టిస్ ఉజ్వల్ భుయాన్ వ్యాఖ్యలు



4 లో..

# నేటి నుంచి ఇంటింటికీ టీడీపీ

**వైసీపీ విధానాలను ఎండగట్టండి**

**ఆ పార్టీ విధ్వంసకర పద్ధతులను ప్రజలకు వివరించండి**

**నాడు ఓట్లేయాలని ఇంటింటికీ వెళ్లి కోరాం**

**నేడు హామీలను నెరవేరుస్తున్నామని చెబుదాం**

**ప్రజాప్రతినిధులు, పార్టీ యంత్రాంగమంతా పాల్గొనాలి**

**స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలూ గెలవాలి**

**పార్టీ నేతలతో టెలికాన్ఫరెన్స్‌లో చంద్రబాబు పిలుపు**



**అమరావతి, జూలై 26**
గొడ్డలి పార్టీ విధానాలు, తప్పుడు పద్ధతులను ప్రజల్లో ఎండగట్టాలని టీడీపీ శ్రేణులకు ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. ఘోర ఓటమి చెందినా ఇప్పటికీ సమాజంలో చిచ్చు రాజేస్తోందని మండిపడ్డారు. గొడ్డలి పార్టీ విధ్వంసకర విధానాలను ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాలన్నారు. ప్రజలతో నిత్యం మాట్లాడుతూ ఉంటే గొడ్డలి పార్టీ కుట్రలను బహిర్గతం చేయవచ్చన్నారు. నిరంతరం ప్రజల్లో ఉండడాన్ని బాధ్యతగా తీసుకోవాలని, ఇది అగ్రస్థాయి మొదలుకుని క్షేత్రస్థాయి నేతల వరకు వర్తిస్తుందని స్పష్టం చేశారు. రెండేళ్ల కూటమి పాలనపై సోమవారం నుంచి 45 రోజుల పాటు ఇంటింటికీ టీడీపీ కార్యక్రమం చేపట్టనున్న సందర్భంగా చంద్రబాబు పార్టీ నాయకులతో ఆదివారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. రెండేళ్ల పాలనపై చేపట్టాల్సిన ఇంటింటి ప్రచారం, ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అంశాలపై పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు. 'ఓట్లేయాలని ఎన్నికల సమయంలో ఇంటింటికీ వెళ్లి చెప్పారు. ఇచ్చిన హామీలను వివరించారు. అదే విధంగా ఇప్పుడు కూడా ప్రతి ఇంటికి వెళ్లి మేమిచ్చిన హామీలను అమలు చేస్తున్నామని చెప్పాలి. ప్రజలు ఏమైనా అనుమానాలు వ్యక్తం చేస్తే వాటిని నివృత్తి చేయాలి. వారికి అర్థమయ్యేలా వివరించాలి' అని సీఎం చంద్రబాబు సూచించారు. గత ఎన్నికల్లో చరిత్రాత్మకమైన విజయాన్ని ప్రజలు అందించారని, ప్రజల ఆశీర్వాదం వల్లే సీట్లలో 94% స్ట్రైక్ రేట్, 57% ఓట్లు సాధించగలిగామని అన్నారు. ఇంటింటికీ టీడీపీ కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు సీరియ్‌సగా తీసుకోవాలని స్పష్టం చేశారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సహా పార్టీ యంత్రాంగం మొత్తం ఈ కార్యక్రమంలో పాల్గొనాలని చెప్పారు. 'కూటమి మళ్లీ అధికారంలోకి రావడం ఖాయం. కానీ ఏమరుపాటు వద్దు. ప్రజలకు నచ్చని, వారు మెచ్చని పనులు చేయకూడదు. రాష్ట్రం కోసం కూటమి ప్రభుత్వం కచ్చితంగా కొనసాగా ల్సిందే. ఇది ప్రతి ఒక్కరికీ అర్థమయ్యేలా చెప్పాలి. యువత సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాల తో పాటు యువతను గొడ్డలి పార్టీ ఏ విధంగా నిర్వీర్యం చేసిందనే అంశాలను వివరించాలి. యువత భవితకు, వాళ్ల ఆలోచనలకు కూటమి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి' అని కోరారు.

**ప్రజలతో సన్నిహితంగా ఉండండి**

'వైసీపీ ప్రభుత్వం చేసిన ఘోర తప్పిదాలు, విధ్వంసం వల్ల 151 సీట్ల నుంచి 11 సీట్లకు పడిపోయింది. టీడీపీ సహా కూటమి పార్టీలు చేసిన పోరాటాలు, ఎన్నికల్లో అనుసరించిన వ్యూహాలతో మంచి మెజార్టీలు సాధించగలిగాం.

మిగతా 4లో...

## పదవుల కన్నా దేశమే ముఖ్యం: అమిత్ షా



**న్యూఢిల్లీ, జూలై 26:**
కేంద్ర విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేస్తూ ధర్మేంద్ర ప్రధాన్ తీసుకున్న నిర్ణయాన్ని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రశంసించారు. వ్యక్తిగత పదవుల కన్నా దేశ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇచ్చిన చర్యగా దానిని అభివర్ణించారు. ఈ మేరకు 'ఎక్స్'లో స్పందించిన షా.. "బీజేపీ కార్యకర్తలకు పదవుల కన్నా దేశం, యువత, విద్యార్థులు వారి ప్రయోజనాలే ముఖ్యం. కేంద్రమంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడమే ఈ సిద్ధాంతానికి నిదర్శనం" అని పేర్కొన్నారు. ప్రధాని మోదీ నేతృత్వంలోని తమ ప్రభుత్వం దేశ యువత భావోద్వేగాలను గౌరవిస్తుందని, పేపర్ లీకేజీలను అరికట్టేందుకు విద్యావ్యవస్థలో కఠిన సంస్కరణలను తెచ్చేందుకు కట్టుబడి ఉందని షా స్పష్టం చేశారు. విద్యాశాఖ మంత్రిగా ధర్మేంద్ర ప్రధాన్ అందించిన సేవలను షా గుర్తుచేసుకున్నారు. జాతీయ విద్యావిధానం అమలు, పీఎంశ్రీ పాఠశాలల విస్తరణ, డిజిటల్ విద్య ప్రోత్సాహంలో ప్రధాన్ విశేష కృషి చేశారని అమిత్‌షా కొనియాడారు.

## ఇది ఆరంభమే

**విద్యలో పారదర్శకత, ప్రభుత్వ బడుల బలోపేతం లక్ష్యంగా పనిచేస్తాం**

**37 రోజుల ఉద్యమంలో ఒత్తిడికి గురయ్యా**

**ప్రధాన్ రాజీనామాతో ప్రశాంతంగా నిద్రించా**

**నా మద్దతుదారులు, విమర్శకులకూ కృతజ్ఞతలు**

**జంతర్‌మంతర్ వద్ద విద్యార్థుల్ని**

**కలవలేకపోయా: అభిజిత్ దీప్కే**

**ఎన్నికల్లో పాల్గొనం**

**ఉద్యమ విస్తరణపైనే దృష్టి: సౌరవ్ దాస్**



న్యూఢిల్లీ, జూలై 26: ఇది ఆరంభం మాత్రమేనని, చేయాల్సిన ప్రయాణం మిగిలే ఉందని కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు, జంతర్‌మంతర్ ఉద్యమ నేత అభిజిత్ దీప్కే వెల్లడించారు. విద్యావ్యవస్థలో పారదర్శకత, స్థోమతతో నిమిత్తం లేకుండా అందరికీ అందుబాటులో చదువు, బలమైన ప్రభుత్వ పాఠశాల వ్యవస్థ కోసం తమ పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. నీట్ ప్రశ్నపత్రం లీకేజీకిగాను కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోరుతూ 37 రోజులపాటు సీజేపీ ఉద్యమించిన విషయం తెలిసిందే.

మిగతా 4లో...

## క్షిపణుల కొరత ఆగిన దాడులు

అమెరికా వద్ద తరిగిపోతున్న క్షిపణుల నిల్వలు

**ప్రభుత్వ సలహాదారుల హెచ్చరికలతో తగ్గిన ట్రంప్**

**ఆదివారం నిలిచిపోయిన అమెరికా, ఇరాన్ దాడులు**

**హోర్ముజ్‌లో సీమైన్ తగిలి పేలిపోయిన ట్యాంకర్!**

**వాషింగ్టన్/దుబాయ్, జూలై 26:**
ఇరాన్‌పై దాడులు మరింత పెంచుతామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇటీవల ప్రకటించారు. ఊహించనంత భారీగా దాడులు ఉంటాయనీ చెప్పారు. కానీ అందుకు విరుద్ధంగా ఇరాన్‌పై దాడుల తీవ్రత తగ్గుతూ వచ్చింది. ఆదివారం అసలు ఎలాంటి దాడులూ చేయలేదు. అమెరికాకు క్షిపణుల కొరత తలెత్తుతుండటం, దౌత్య చర్యల్లో పురోగతి, యుద్ధం మరింత విస్తరించే ప్రమాదం ఉందని రక్షణశాఖ ఉన్నతాధికారులు, సలహాదారులు హెచ్చరించడమే దీనికి కారణమని అమెరికా మీడియా వెల్లడించింది. అమెరికా ఎంతగా దాడులు చేస్తున్నా ఇరాన్ ఏమాత్రం వెనక్కితగ్గడం లేదు.. పైగా చవకైన డ్రోన్లు, క్షిపణులతో

మిగతా 4లో...



## అక్రమ అరెస్టులతో మమ్మల్ని ఆపలేరు

- మంత్రి, ఎంపీలపై మండిపడ్డ బీఆర్ఎస్ నేతలు
- ప్రతిపక్షాల గొంతునొక్కే కుట్ర మానుకోవాలని డిమాండ్



**మన సమాజం/చెన్నూరు:**
అక్రమ అరెస్టులతో బాల్క సుమన్ సైనికులను ఆపలేరని శనివారం రోజున స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నేతలు పేర్కొన్నారు. చెన్నూరులో పోలీసులను అడ్డుపెట్టుకొని మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ప్రతిపక్షాల గొంతు నొక్కేసే కుట్ర చేస్తున్నాడని, అందులో భాగంగానే తమ నేతలను, కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేస్తూ, బైండొవర్లు చేస్తున్నట్లు వారు ఆరోపించారు. పక్క నియోజకవర్గాల్లో సొంత పార్టీ నేతలే అడ్డుకొని వెనక్కి పంపినా మంత్రి గడ్డం వివేక్, ఎంపీ వంశీకృష్ణల తీరులో మార్పు రాలేదని వారు ఎద్దేవా చేశారు. తెలంగాణలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ యాభై ఉద్యోగాలు కూడా ఇవ్వలేదని ఎంపీ గడ్డం వంశీకృష్ణ చేసిన వాక్యలు హాస్యాస్పదం అని, చెన్నూరు యువతకు 40వేల ఉద్యోగాలు ఇస్తానని మోసపూరిత హామీ ఇచ్చి గద్దెనెక్కిన మీ తండ్రిగారిని నిలదీసి చెన్నూరు యువతకు 40వేల ఉద్యోగాలు ఇచ్చి మీ మాట నిలబెట్టుకోవాలని వారు సూచించారు. చెన్నూరు ప్రజలకు ఇచ్చిన హామీలను గూర్చి తండ్రీ కొడుకులను నిలదీసినా, వారి అనుచరులు చేస్తున్న అక్రమాలను గూర్చి ప్రశ్నించినా మంత్రి వివేక్ జీర్ణించుకోలేక అక్రమ అరెస్టులతో తమని అడ్డుకోవాలని చూస్తున్నాడని, అరెస్టులు చేసి అక్రమ కేసులు బాణాయించినంత మాత్రాన తమని ఆపలేరనే విషయాన్ని గమనించి మంత్రి చిల్లర పనులు మానుకోవాలని వారు సూచించారు. మరోమారు ఈ చర్యలు పునరావృతం అయితే ఊరుకోబోమని, నియోజకవర్గం అంతా నిరసనలు చేపట్టి మంత్రి ఆగడాలను ప్రజల ముందు ఎండగడతామని బీఆర్ఎస్ నేతలు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మంత్రి బాపు, మాజీ జడ్పీటీసీ మోతె తిరుపతి, నాయకులు మాణిశెట్టి శ్రీనివాస్, రెవెల్లి మహేష్, మేడ సురేష్, తుమ్మ రమేష్, సాంబా గౌడ్, బుర్ర రాకేష్, విద్యాసాగర్, ఎండీ నయాబ్, తిరుపతి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## రాత్రి పూట త్వరగా భోజనం చేయాలని చెబుతున్న సైంటిస్టులు..

### ఎందుకో తెలిస్తే మీరు కూడా అలాగే చేస్తారు..

పూర్వం ప్రజలు రోజూ శారీరక శ్రమ చేసే వారు. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను కలిగి ఉండేవారు. రోజూ బలవర్ధకమైన ఆహారం తినేవారు. అంతేకాదు రాత్రి పూట త్వరగా భోజనం చేసేవారు. త్వరగా నిద్రించేవారు. ఉదయం త్వరగా నిద్రలేచేవారు. ఇలా అన్ని రకాలుగా వారు ఆరోగ్యకరమైన అలవాట్లను పాటించేవారు. కనుకనే ఎన్నో ఏళ్ల పాటు వారు ఆరోగ్యంగా జీవించ గలిగారు. అయితే అప్పట్లో ప్రజలు అంత ఆరోగ్యంగా ఉండడానికి కారణం పౌష్టికాహారం తీసుకోవడం మాత్రమే కాకుండా రాత్రి పూట త్వరగా భోజనం చేయడమే అని చెప్పవచ్చు. సైంటిస్టులు ఈ విషయంపై అధ్యయనాలు కూడా చేపట్టి వాస్తవమే అని తేల్చారు. ఈ క్రమంలోనే రాత్రి పూట త్వరగా భోజనం చేయాలని, దీని వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతా యని సూచిస్తున్నారు.

**బరువు తగ్గేందుకు..**
రాత్రి పూట త్వరగా భోజనం చేయడం వల్ల అనేక వ్యాధులు, అనారోగ్య సమస్యలు రాకుండా చూసుకోవచ్చు. భోజనాన్ని కనీసం రాత్రి 7.30 గంటల లోపు ముగించాల్సి ఉంటుంది. రాత్రి పూట త్వరగా భోజనం చేయడం వల్ల శరీర మెటబాలిజం మెరుగు పడుతుంది. దీంతో క్యాలరీలు సులభంగా ఖర్చవుతాయి. కొవ్వు కరుగుతుంది. అధిక బరువు తగ్గుతారు. బరువు తగ్గాలనుకునే వారు కచ్చితంగా రాత్రి పూట త్వరగా భోజనం చేయాలి. దీని వల్ల మనం తిన్న ఆహారం నుంచి వచ్చే శక్తిని ఖర్చు పెట్టేందుకు శరీరానికి తగిన సమయం లభిస్తుంది. దీంతో క్యాలరీలు సులభంగా ఖర్చవుతాయి. కొవ్వు కరిగి అధిక బరువు తగ్గుతారు. బరువు తగ్గాలని చూస్తున్నవారు తప్పనిసరిగా ఈ సూచనను పాటించాల్సి ఉంటుంది. రాత్రి పూట త్వరగా భోజనం చేయడం వల్ల శరీరంలో కొవ్వు అధికంగా చేరకుండా చూసుకోవచ్చని సైంటిస్టుల అధ్యయనాల్లో తేలింది. దీని వల్ల ఊబకాయం బారిన పడకుండా ఉంటారు. రాత్రి పూట త్వరగా భోజనం చేయడం వల్ల క్యాన్సర్ రాకుండా చూసుకోవచ్చని సైంటిస్టులు చెబుతున్నారు. రాత్రి పూట త్వరగా భోజనం చేస్తే క్యాన్సర్లు వచ్చే అవకాశాలు గణనీయంగా తగ్గుతాయని అంటున్నారు. త్వరగా భోజనం ముగించే పురుషులకు 26 శాతం వరకు క్యాన్సర్ ముప్పు తగ్గుతుంది. అదే స్త్రీలకు అయితే 16 శాతం వరకు క్యాన్సర్ వచ్చే ముప్పు తగ్గుతుంది. రాత్రి త్వరగా భోజనం చేసి త్వరగా నిద్రించడం వల్ల ఉదయం త్వరగా నిద్రలేస్తారు. దీని వల్ల నిద్రలేమి ఉండదు. పైగా ఉదయం నిద్ర లేచిన వెంటనే యాక్టివ్‌గా ఉన్నట్లు ఫీలవుతారు. శరీరానికి శక్తి లభించినట్లు ఉత్సాహం వస్తుంది. రోజంతా శక్తి స్థాయిలు అధికంగా ఉంటాయి. యాక్టివ్‌గా పనిచేస్తారు. ఉత్సాహంగా ఉంటారు. బద్దకం పోతుంది. రాత్రి పూట త్వరగా భోజనం చేస్తే జీర్ణ వ్యవస్థకు కావల్సినంత విశ్రాంతి లభిస్తుంది. దీని వల్ల జీర్ణ వ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది. ఆహారాన్ని సులభంగా జీర్ణం చేయగలుగుతుంది. జీర్ణ వ్యవస్థలో ఉండే అవయవాలు సులభంగా మరమ్మత్తులకు గురవుతాయి. దీని వల్ల జీర్ణ సమస్యలు తగ్గిపోతాయి. ముఖ్యంగా గ్యాస్, అసిడిటీ, మలబద్దకం, అజీర్తి తగ్గుతాయి. అలాగే రాత్రి త్వరగా భోజనం చేస్తే నిద్రించే సమయానికి ఆహారం సులభంగా జీర్ణం అవుతుంది. దీంతో నిద్ర చక్కగా పడుతుంది. రాత్రి పూట భోజనానికి, నిద్రకు మధ్య కనీసం 3 గంటల వ్యవధి ఉండాలని వైద్యులు చెబుతుంటారు.

# సింగరేణి టెండర్లలో జీఎం రాధాకృష్ణ 'లీలలు'..!

**మందమర్రి సెక్యూరిటీ గార్డుల కాంట్రాక్ట్‌లో నిబంధనలు బలి**

**నకిలీ సర్టిఫికెట్ల సంస్థకు కాసుల కుంభవృష్టి..!**

**లీగల్ ఒపీనియన్ రాకముందే అర్హులపై కక్షసాధింపు వేటు**

**తిమింగలాలను కాపాడుతున్న విజిలెన్స్..?**

**ఆధారాలతో ఫిర్యాదు చేసినా 15 రోజులుగా మౌనం.. వెనుక భారీ డీల్?**

**మంచిర్యాల,జూలై 26,(మన సమాజం):**
సింగరేణి సంస్థలో టెండర్ల పారదర్శకతను మంటగలుపుతూ మందమర్రి ఏరియాలో పెద్ద కుంభకోణమే జరిగినట్లు తెలుస్తోంది. మందమర్రి ఏరియాకు సంబంధించి 90 మంది సెక్యూరిటీ గార్డుల నియామకం కోసం చేపట్టిన టెండర్ ప్రక్రియలో నిబంధనలను పూర్తిగా తుంగలో తొక్కినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మందమర్రి జనరల్ మేనేజర్ (జీఎం) రాధాకృష్ణ వ్యవహారశైలి, ఆయన తీసుకున్న పక్షపాత నిర్ణయాలు ఇప్పుడు సింగరేణి వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. ఒక అర్హత కలిగిన సంస్థను కావాలనే లక్ష్యంగా చేసుకుని, కనీసం లీగల్ ఒపీనియన్ రాకముందే అత్యుత్సాహంతో డిస్క్వాలిఫై చేయడం సింగరేణి అంతర్గత కుమ్మక్కుకు నిదర్శనమని బాధిత సంస్థ ఆరోపిస్తోంది.




### నకిలీ పత్రాలకు జీఎం వెసులుబాట్లు..!

ఈ టెండర్ ప్రక్రియలో ఒక సంస్థకు అనుకూలంగా నిబంధనలను పూర్తిగా సడలించడమే కాకుండా, సదరు సంస్థ సమర్పించిన నకిలీ ధ్రువీకరణ పత్రాలను (ఫేక్ సర్టిఫికెట్లు) సైతం జీఎం యంత్రాంగం గుడ్డిగా ఆమోదించినట్లు ఆరోపణలు ఉన్నాయి. నిబంధనల ప్రకారం నకిలీ పత్రాలు సమర్పించిన సంస్థను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాల్సింది పోయి, వారికే అన్ని రకాల వెసులుబాట్లు కల్పిస్తూ టెండర్ కట్టబెట్టేందుకు తెరవెనుక పెద్ద నాటకమే నడిచిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అర్హత కలిగిన బాధిత సంస్థ సదరు నకిలీ పత్రాలకు సంబంధించిన అన్ని రకాల పక్కా ఆధారాలను సేకరించి ఉంచినట్లు పేర్కొంది. తమపై కఠిన నిబంధనలు అమలు చేస్తూ, ఫేక్ సర్టిఫికెట్లు సమర్పించిన వారికి రెడ్ కార్పెట్ పరచడం వెనుక జీఎం ప్రయోజనాలు ఏమిటనే ప్రశ్నలు సింగరేణి వర్గాల్లో వెల్లువెత్తుతున్నాయి.

### 15 రోజులుగా విజిలెన్స్ మౌనం వెనుక మర్మమేంటి?

ఈ దారుణమైన అవినీతి, అక్రమాలపై బాధిత సంస్థ సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ)తో పాటు విజిలెన్స్ అధికారులకు పూర్తి ఆధారాలతో ఫిర్యాదు చేసి 15 రోజులు గడుస్తున్నా యాజమాన్యంలో ఎలాంటి చలనం కనిపించడం లేదని ఆరోపిస్తోంది. ఉన్నతాధికారులకు స్పష్టమైన ఆధారాలతో ఫిర్యాదు అందిన ఇన్ని రోజులవుతున్నా ఇప్పటివరకు కనీసం విచారణ కూడా ప్రారంభించకపోవడం వెనుక సింగరేణి విజిలెన్స్ విభాగం పాత్రపై కూడా అనేక అనుమానాలు రేకెత్తుతున్నాయి. అవినీతిని అరికట్టాల్సిన విజిలెన్స్ విభాగం ఇంతటి ఆరోపణలు వచ్చినా మౌనం వహించడం వెనుక జీఎం రాధాకృష్ణను కాపాడే ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పలుమార్లు చేసిన ప్రాతినిధ్యాలు, ఫిర్యాదులను సైతం బుట్టదాఖలు చేయడంపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.

### మొత్తం ప్రక్రియపై స్వతంత్ర విచారణ జరపాలి!

**దుర్గరాజు ,సీపీఐ మందమర్రి పట్టణ కార్యదర్శి**

ఈ పక్షపాత, అక్రమ టెండర్ ప్రక్రియను తక్షణమే రద్దు చేసి, మొత్తం వ్యవహారంపై స్వతంత్ర విజిలెన్స్ విచారణ జరిపించాలని, బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ మందమర్రి పట్టణ కార్యదర్శి దుర్గరాజ్ డిమాండ్ చేశారు. ఈ సంచలన ఆరోపణలపై సింగరేణి యాజమాన్యం గానీ, విజిలెన్స్ విభాగం గానీ, లేదా ఆరోపణలు ఎదుర్కొంటున్న జీఎం రాధాకృష్ణ గానీ ఇప్పటివరకు అధికారికంగా స్పందించకపోవడం గమనార్హమని ఆయన పేర్కొన్నారు.

# చెన్నూరులో మళ్లీ 'ఓదెలు' పొలిటికల్ సౌండ్..!

**రాజకీయంగా తనను పక్కన పెట్టే కుట్రలను పసిగట్టారా..?**

**ఇక ప్రజాక్షేత్రమే తన రాజకీయ వేదికగా మార్చుకుంటున్నారా..?**

**రెండు పార్టీలతో చేదు అనుభవం.. ఇప్పుడు సొంత రాజకీయ బాటలో మాజీ ఎమ్మెల్యే..!**

**2018లో బీఆర్ఎస్.. 2023లో కాంగ్రెస్.. రెండుసార్లు నిరాశేనా..?**

**కార్పొరేషన్ పదవి కోసం రెండున్నరేళ్ల నిరీక్షణకు తెరపడనుందా..?**

**చెన్నూరు,జూలై 26,(మన సమాజం):**
చెన్నూరు మాజీ ఎమ్మెల్యే, కార్మిక నేత నల్లాల ఓదెలు రాజకీయ భవిష్యత్‌పై నియోజకవర్గంలో ఆసక్తికర చర్చ సాగుతోంది. రాబోయే రోజుల్లో చెన్నూరు రాజకీయాల్లో తనదైన ముద్ర వేసేందుకు ఓదెలు మళ్లీ ప్రజాక్షేత్రంలో చురుగ్గా అడుగులు వేస్తున్నారనే ప్రచారం రాజకీయ వర్గాల్లో జోరందుకుంది. ఇప్పటికే నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తూ కార్మికులు, ప్రజలను కలుస్తూ వారి సమస్యలను తెలుసుకుంటున్న ఆయన.. ప్రజలతో మమేకమవుతున్న తీరు ఇప్పుడు రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది. 2018 ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ తనను రాజకీయంగా మోసం చేసిందని ఓదెలు వర్గీయులు భావిస్తుండగా, 2023 ఎన్నికల అనంతరం కాంగ్రెస్‌లోనూ అదే పరిస్థితి ఎదురైందనే అసంతృప్తి ఆయన అనుచరుల్లో వ్యక్తమవుతున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కనీసం ఏదైనా కార్పొరేషన్ పదవి దక్కుతుందనే ఆశతో రెండున్నరేళ్లుగా ఓదెలు ఎదురుచూస్తున్నారని, అయితే పార్టీలో తన ప్రభావాన్ని క్రమంగా తగ్గిస్తూ, రాజకీయంగా తన ఉనికిని బలహీనపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయనే విషయాన్ని ఆయన గ్రహించినట్లు ఓదెలు వర్గీయులు చర్చించుకుంటున్నారు. ఇక రాజకీయ భవిష్యత్‌పై ఇతరుల నిర్ణయాల కోసం ఎదురుచూడకుండా.. తన రాజకీయ బలాన్ని ప్రజల్లోనే పరీక్షించుకోవాలని నల్లాల ఓదెలు నిర్ణయించుకున్నారా..? అనే ప్రశ్నలు ఇప్పుడు చెన్నూరు రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. కార్మిక ఉద్యమ నేపథ్యం, ప్రజలతో ఉన్న అనుబంధాన్ని నమ్ముకుని ముందుకు సాగుతున్న ఆయన.. నియోజకవర్గంలోని ప్రజా సమస్యలను తెలుసుకుంటూ, తన అనుచరులు, కార్మిక వర్గంతో విస్తృతంగా మమేకమవుతున్న తీరు భవిష్యత్ రాజకీయ వ్యూహానికి సంకేతమా అనే చర్చ సాగుతోంది. ఇప్పటివరకు రెండు ప్రధాన రాజకీయ పార్టీల్లో ఎదురైన పరిణామాలను దృష్టిలో పెట్టుకుని రాబోయే రోజుల్లో నల్లాల ఓదెలు కీలక రాజకీయ నిర్ణయం తీసుకునే అవకాశం ఉందా..? అన్న ఆసక్తి నెలకొంది. చెన్నూరు నుంచి మరోసారి ప్రత్యక్ష రాజకీయ పోరుకు సిద్ధమవుతున్నారనే ప్రచారం నేపథ్యంలో.. ఆయన ఏ పార్టీలో ఉంటారు..? పార్టీ మారుతారా..? లేక తన రాజకీయ భవిష్యత్‌పై సంచలన నిర్ణయం తీసుకుంటారా..? అనే అంశంపై రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. ఓదెలు ప్రజాక్షేత్రంలోకి తిరిగి రావడం వెనుక కేవలం ప్రజా సమస్యలే ఉన్నాయా..? లేక చెన్నూరు రాజకీయాల్లో తన భవిష్యత్‌కు కొత్త బాట వేసుకునే వ్యూహమా..? అనేది రాబోయే రోజుల్లో తేలనుంది. అయితే, మాజీ ఎమ్మెల్యేగా తనకున్న పరిచయాలు, కార్మిక వర్గంలో ఉన్న పట్టు, ప్రజలతో ఉన్న సంబంధాలను తిరిగి బలోపేతం చేసుకునే దిశగా ఆయన అడుగులు వేస్తున్నారనే ప్రచారం మాత్రం చెన్నూరు రాజకీయాల్లో కొత్త చర్చకు తెరలేపింది. నల్లాల ఓదెలు తదుపరి అడుగు ఏమిటన్నదే ఇప్పుడు చెన్నూరు రాజకీయాల్లో హాట్‌టాపిక్‌గా మారింది.



## ఎస్బీ, ఇంటెలిజెన్స్ రిపోర్టులకు

# విలువ లేదా..?

**పొలిటికల్ పవర్ ముందు నిఘా వ్యవస్థలు మోకరిల్లుతున్నాయా..?**

**అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులపై చర్యలు ఎక్కడ..?**

**రిపోర్టులు తీసుకోవడం ఎందుకు..?**

**వాటిని చెత్తబుట్టలో వేయడమెందుకు..?**

**మంచిర్యాల జూలై 26,(మంచిర్యాల):**
రామగుండం కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల జిల్లాలో పోలీస్ శాఖ పనితీరుపై, ముఖ్యంగా ఎస్బీ (స్పెషల్ బ్రాంచ్), ఇంటెలిజెన్స్ శాఖలు అందిస్తున్న నివేదికలపై ఇప్పుడు తీవ్ర చర్చ జరుగుతోంది. జిల్లాలోని క్షేత్రస్థాయి పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ, అధికారుల పనితీరు నుంచి పోలీస్ శాఖలో జరుగుతున్న పరిణామాల వరకు సమాచారాన్ని సేకరించి ఉన్నతాధికారులకు నివేదికలు అందించే ఈ రెండు కీలక విభాగాల రిపోర్టులకు అసలు విలువ ఎంత..? అన్న ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. ఇప్పటి వరకు ఎస్బీ, ఇంటెలిజెన్స్ శాఖలు అందించిన నివేదికల ఆధారంగా మంచిర్యాల జిల్లాలో ఎంతమంది అధికారులపై చర్యలు తీసుకున్నారు..? ఎంతమంది అధికారుల పనితీరుపై ఉన్నతాధికారులకు నివేదికలు వెళ్లాయి..? ఆ నివేదికలపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు..? అనే విషయాలను పోలీస్ ఉన్నతాధికారులు స్పష్టం చేయాల్సిన అవసరం ఉంది.పోలీస్ శాఖలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులు, వివాదాస్పదంగా వ్యవహరిస్తున్న సిబ్బంది, తమ వ్యవహారశైలితో మొత్తం పోలీస్ వ్యవస్థకే చెడ్డపేరు తీసుకువస్తున్న అధికారుల గురించి శాఖలోని ప్రతి ఒక్కరికీ తెలిసినా.. వారిపై చర్యలు ఎందుకు ఉండటం లేదనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఎస్బీ, ఇంటెలిజెన్స్ రిపోర్టులు కేవలం పై అధికారుల టేబుళ్లపైకి చేరి ఫైళ్లలోనే పాతిపెట్టబడుతున్నాయా..? లేక రాజకీయ పలుకుబడి ముందు ఆ నివేదికలకు విలువ లేకుండా పోతుందా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. క్షేత్రస్థాయిలో ప్రాణాలకు తెగించి సమాచారాన్ని సేకరించే ఎస్బీ, ఇంటెలిజెన్స్ సిబ్బంది కష్టాన్ని, వారు అందించే సమాచారాన్ని గౌరవించాల్సిన బాధ్యత పోలీస్ ఉన్నతాధికారులపై ఉంది. రిపోర్టులు కావాలి.. కానీ చర్యలు మాత్రం వద్దు అనే విధానం కొనసాగితే నిఘా వ్యవస్థల విశ్వసనీయతే ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉంది. ఒకవైపు ఎస్బీ, ఇంటెలిజెన్స్ రిపోర్టులను ఆధారంగా చేసుకుని నిర్ణయాలు తీసుకుంటున్నామని చెప్పడం.. మరోవైపు అదే నివేదికల్లో పేర్కొన్న అంశాలపై చర్యలు తీసుకోకపోవడం దేనికి సంకేతం..? రాజకీయ ఒత్తిళ్లు,



పలుకుబడులు, వ్యక్తిగత ప్రయోజనాలు నిఘా వ్యవస్థల నివేదికల కంటే పైచేయి సాధిస్తున్నాయా..? అన్న చర్చ జిల్లాలో జరుగుతోంది.అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నా, శాఖ ప్రతిష్టకు భంగం కలిగించేలా వ్యవహరిస్తున్నా, వ్యవస్థకు ఇబ్బందులు కలిగిస్తున్నా.. అధికారులపై చర్యలు తీసుకోకుండా కేవలం పదవుల్లో కొనసాగించడం వల్ల ప్రజల్లో పోలీస్ శాఖపై నమ్మకం ఎలా నిలబడుతుంది..? అన్న ప్రశ్నకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉన్నతాధికారులదే. ఎస్బీ, ఇంటెలిజెన్స్ శాఖలపై నమ్మకం లేకపోతే వాటిని ఎందుకు కొనసాగిస్తున్నారు..? నమ్మకం ఉంటే వారు అందించే రిపోర్టులపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు..? రిపోర్టులు తీసుకుని, వాటిని పక్కనపెట్టి, రాజకీయ పవర్‌కు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటున్నారనే భావన ప్రజల్లో కలిగితే.. అది కేవలం ఆ రెండు శాఖల ఆత్మగౌరవానికే కాదు, మొత్తం పోలీస్ వ్యవస్థ విశ్వసనీయతకే మచ్చగా మారుతుంది. ఇప్పటికైనా మంచిర్యాల జిల్లాలో ఎస్బీ, ఇంటెలిజెన్స్ శాఖలు గతంలో అందించిన నివేదికలను సమీక్షించి.. వాటిపై తీసుకున్న చర్యలపై ఉన్నతాధికారులు స్పష్టత ఇవ్వాలి. ఆరోపణలు నిజమని తేలితే ఎంతటి అధికారులైనా ఉపేక్షించకుండా చర్యలు తీసుకోవాలి. లేకపోతే నిఘా వ్యవస్థలు ఇచ్చే నివేదికలు కేవలం "కాగితాలకే పరిమితమా..?" అనే ప్రశ్నకు సమాధానం చెప్పాల్సిన పరిస్థితి పోలీస్ శాఖకే వస్తుంది.

## బిఎస్ఎన్ఎల్‌లో

# ఏం జరుగుతోంది..?

**పట్టపగలు గోడలు పగలగొట్టి స్క్రాప్ తరలింపుపై అనుమానాలెన్నో!**

**విద్యాసాగర్ డ్యూటీలో ఉన్న సమయంలోనే చోరీ ఎలా జరిగింది..?**

**చోరికి బాధ్యులు ఎవరు,బాధ్యత ఎవరిది?**

**విద్యాసాగర్ పై చర్యలు తీసుకోవడానికి అధికారులు భయపడుతున్నారా..**

**చర్యలు తీసుకుంటే తెరవెనుక కథ నడిపిన అధికారుల బాగోతం బయటపడుతుందనే భయమా..?**

**స్క్రాప్ వ్యవహారంపై జిఎం/సి జి ఎం ఉన్నతస్థాయి విచారణకు ఆదేశిస్తారా..?**

**అసలు బాగోతం బయటపడేది ఎన్నడు..?**

**మంచిర్యాల,జూలై 26,(మన సమాజం) :**
మంచిర్యాల బిఎస్ఎన్ఎల్ కార్యాలయంలో స్క్రాప్, మెటీరియల్ తరలింపు వ్యవహారం రోజురోజుకూ అనేక అనుమానాలకు తావిస్తోంది. పట్టపగలు కార్యాలయ గోడలు పగలగొట్టి సామగ్రి ఎత్తుకెళ్లే పరిస్థితి ఎలా ఏర్పడింది? ఆ సమయంలో డ్యూటీలో ఉన్న సిబ్బంది బాధ్యత ఏమిటి? కార్యాలయ భద్రతను పర్యవేక్షించాల్సిన అధికారులు ఏం చేస్తున్నారు? అనే ప్రశ్నలు ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.ముఖ్యంగా విద్యాసాగర్ డ్యూటీలో ఉన్న సమయంలోనే దొంగతనం జరిగిందనే ఆరోపణలు నిజమైతే, ఈ ఘటనకు బాధ్యులెవరు? డ్యూటీలో ఉన్న సిబ్బందిపై శాఖాపరంగా ఎలాంటి చర్యలు తీసుకున్నారు? లేదా అసలు చర్యలు ఎందుకు తీసుకోలేదు? అనే ప్రశ్నలకు బిఎస్ఎన్ఎల్ ఉన్నతాధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.అంతేకాకుండా, డ్యూటీలో ఉన్న సమయంలో




చోరీ జరిగితే బాధ్యతను ఎవరు వహించాలి? ఒకవేళ విద్యాసాగర్‌పై చర్యలు తీసుకోకుండా అధికారులు మౌనం వహిస్తుంటే, దాని వెనుక కారణమేంటి? విద్యాసాగర్‌పై చర్యలు తీసుకుంటే తెరవెనుక వ్యవహారం నడిపినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇతర అధికారుల పేర్లు కూడా బయటకు వస్తాయనే కారణంతోనే ఆయనను కాపాడుతున్నారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ఈ మొత్తం వ్యవహారంలో పట్టపగలు గోడలు పగలగొట్టి సామగ్రి తరలింపునకు అసలు బాధ్యులు ఎవరు? కార్యాలయ ఆస్తులను తరలించేందుకు ఎవరి అనుమతి ఉంది? స్క్రాప్ తరలింపునకు సంబంధించి గేట్‌పాస్‌లు, స్టాక్ రిజిస్టర్లు, వాహనాల వివరాలు, సీసీ కెమెరా ఫుటేజీ, డ్యూటీ రిజిస్టర్లు పరిశీలించారా? అన్నది తేలాల్సి ఉంది.బిఎస్ఎన్ఎల్‌లో అసలు ఏం జరుగుతోంది? అనే ప్రశ్నకు సమాధానం రావాలంటే స్థానిక స్థాయిలో కాకుండా జిఎం/సీజీఎం స్థాయి ఉన్నతాధికారులు సమగ్ర విచారణకు ఆదేశించాల్సిన అవసరం ఉంది. స్క్రాప్ వ్యవహారం మొదలుకొని పట్టపగలు జరిగినట్లు ఆరోపణలు వస్తున్న చోరీ వరకు ప్రతి అంశాన్ని విచారించి, బాధ్యులు ఎవరో తేల్చాలని పలువురు కోరుతున్నారు.విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయా? లేక ఈ వ్యవహారం కూడా ఫైళ్లలోనే సమాధి అవుతుందా? అన్నది వేచి చూడాలి. అధికారుల ప్రమేయంపై వస్తున్న ఆరోపణలు నిజమా? కాదా? అనేది తేల్చాల్సిన బాధ్యత బిఎస్ఎన్ఎల్ ఉన్నతాధికారులదేనని పలువురు పేర్కొంటున్నారు.

### ప్రగతి నగర్ బీజేపీ కార్యాలయంలో

## ఘనంగా కార్గిల్ విజయ్ దివస్



**నిజాంపేట్, జూలై 26**
ప్రగతి నగర్ బీజేపీ అధ్యక్షులు నరేంద్ర చౌదరి ఆధ్వర్యంలో ప్రగతి నగర్ బీజేపీ కార్యాలయంలో కార్గిల్ విజయ్ దివస్ ఘనంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా పలువురు పార్టీ సీనియర్ నాయకులు కార్గిల్ యుద్ధంలో భారత సైన్యం ప్రదర్శించిన అపార ధైర్యసాహసాలు, దేశభక్తి, త్యాగనిరతి గురించి వివరించారు. అనంతరం దేశ రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన కార్గిల్ అమరవీరులకు నివాళులర్పిస్తూ రెండు నిమిషాల మౌనం పాటించి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ టీచర్స్ సెల్ సహ-కన్వీనర్ సుమన్ రావు, ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షులు రవి యాదవ్, సీనియర్ బీజేపీ నాయకులు శ్రీధర్ రెడ్డి, ప్రగతి నగర్ బీజేపీ ప్రధాన కార్యదర్శి మధన్ గౌడ్,ఉపాధ్యక్షులు నరేష్, సత్యనారాయణ, కార్యదర్శులు లక్ష్మి, వెంకటయ్య, సోషల్ మీడియా కన్వీనర్ వెంకట్, ఓబీసీ మోర్చా అధ్యక్షులు శంకర్ రావు వారి బృందం, మహిళా మోర్చా అధ్యక్షురాలు మోక్ష శ్రీ, గాజుల సుజాత,రూపాలి, రాధిక, యువమోర్చా అధ్యక్షులు దొడ్డ పవన్, ప్రధాన కార్యదర్శి రామరాజు, ఉపాధ్యక్షులు వంశీ కిషోర్ , శివ కుమార్ రాజు, కార్తీక్, సుభదీర్, సీనియర్ నాయకులు ఆనందోబ్రహ్మ , చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం దేశభక్తి భావనను మరింత బలోపేతం చేస్తూ, కార్గిల్ అమరవీరుల త్యాగాలను స్మరించుకునేలా ఘనంగా జరిగింది.

### నిర్లక్ష్య నిర్మాణంతో నూతన డబుల్ రోడ్డు

## ప్రమాదాలకు నిలయం..

**సేఫ్టీ చర్యలు లేక ప్రజల ప్రాణాలతో చెలగాటం..**

**కాంట్రాక్టర్, ఆర్ అండ్‌బీ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్...**

**వెంకటగిరి ఎక్స్‌రోడ్--ముదిగొండ మార్గంలో అసంపూర్తి కల్వర్టులు,**

**హెచ్చరిక బోర్డులు లేక వరుస ప్రమాదాల ముప్పు....**

**ఖమ్మం, జూలై 26**
ముదిగొండ--కోదాడ ప్రధాన రహదారిపై వెంకటగిరి ఎక్స్‌రోడ్ నుంచి ముదిగొండ గ్రామం వరకు నూతనంగా నిర్మిస్తున్న డబుల్ రోడ్డు పనులు తీవ్ర నిర్లక్ష్యంగా సాగుతున్నాయని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు విస్తరణలో భాగంగా కల్వర్టులను తొలగించి, కొత్త నిర్మాణాలను మధ్యలోనే వదిలేయడంతో పాటు రోడ్డు పక్కలను లోతుగా తవ్వి ఎలాంటి భద్రతా చర్యలు చేపట్టకపోవడం వల్ల ప్రయాణికుల ప్రాణాలకు ముప్పు ఏర్పడిందని ఆరోపిస్తున్నారు. ప్రమాదకర ప్రాంతాల వద్ద హెచ్చరిక బోర్డులు, రిఫ్లెక్టర్లు, బారికేడ్లు, లైటింగ్ వంటి కనీస భద్రతా ఏర్పాట్లు లేకపోవడంతో రాత్రి వేళల్లో వాహనదారులు ప్రమాదాలను గుర్తించలేక ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా కల్వర్టుల నిర్మాణ ప్రాంతాల్లో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారిందని స్థానికులు చెబుతున్నారు. ఈ నిర్లక్ష్యానికి నిదర్శనంగా ఆదివారం రాత్రి వెంకటాపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ముదిగొండ పెట్రోల్ బంక్ సమీపంలోని అసంపూర్తి కల్వర్టు వద్ద ప్రమాదానికి గురయ్యాడు. అక్కడ ఎలాంటి భద్రతా ఏర్పాట్లు లేకపోవడంతో వాహనం అదుపు తప్పి తీవ్రంగా గాయపడినట్లు సమాచారం. ప్రస్తుతం అతడు ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నట్లు తెలిసింది. రోడ్డు నిర్మాణం పేరుతో ప్రజల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టడం ఎంతవరకు సమంజసమని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. నిర్మాణ సంస్థ నిర్లక్ష్యంతో పాటు పనులను పర్యవేక్షించాల్సిన రోడ్లు ఢ భవనాల శాఖ (ఆర్‌డబీ) అధికారుల వైఫల్యమే ఇటువంటి ప్రమాదాలకు కారణమని వారు ఆరోపిస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి ప్రమాదకర ప్రాంతాల్లో పూర్తి స్థాయి భద్రతా చర్యలు చేపట్టాలని, హెచ్చరిక బోర్డులు, బారికేడ్లు, రిఫ్లెక్టర్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే నిర్లక్ష్యంగా వ్యవహరించిన కాంట్రాక్టర్‌పై, పనులను పర్యవేక్షించడంలో విఫలమైన అధికారులపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

### ఘనంగా అర్ కె ట్రావెల్స్ నాదెళ్ల చంద్రమౌళి అమృత మహోత్సవ వేడుకలు

**హైదరాబాద్, జూలై 26**
అర్ కె ట్రావెల్స్ అధినేత నాదెళ్ల చంద్రమౌళి 75వ జన్మదిన (అమృత మహోత్సవ) వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్ర మానికి కుత్బుల్లాపూర్ నియోజ కవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి హాజరై నాదెళ్ల చంద్రమౌళి కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా అయన శ్రీమన్ నాదెళ్ల చంద్రమౌళి ఆయురారో గ్యాలతో, ఆనందంగా, మరెన్నో సంవత్సరాలు ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షించారు.



# మెగా హెల్త్ క్యాంపు లో పాల్గొన్న కాంగ్రెస్ దిగ్గజ నాయక త్రయం





**కుత్బుల్లాపూర్ జులై 26 :**
ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బహదూర్‌పల్లి డివిజన్ పరిధిలోని గ్రీన్ హిల్స్ కాలనీలో బి కే అర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, టీపీసీసీ ప్రోటోకాల్ వైస్ చైర్మన్ బొగునూరి కిశోర్ రెడ్డి  ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా హెల్త్ క్యాంపు కార్యక్రమంలో మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత రావు, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి, టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతి రెడ్డి లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మెగా హెల్త్ క్యాంపును పరిశీలించి, ప్రజలకు అందిస్తున్న ఉచిత వైద్య సేవలను అభినందించారు. ప్రజలు ఇలాంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. సమాజ సేవా దృక్పథంతో ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్న బి కే అర్ ఫౌండేషన్ నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, వైద్యులు, కార్యకర్తలు, స్థానిక నాయకులు మరియు కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

**నియోజకవర్గం నూతన డివిజన్ అధ్యక్షులకు సత్కారం :**
అంతకు ముందు భూపతిరెడ్డి కార్యాలయం లో జరిగిన ముగ్గురి ఆత్మీయ కలయికలో భాగంగా మైనంపల్లి హనుమంతరావు ఇటీవల కుత్బుల్లాపూర్ నియోజకవర్గం డివిజన్లకు నూతనంగా ఎన్నికైన పలువురు అధ్యక్షులను శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీ పెద్దల సూచనలు, దిశా నిర్దేశం తో  తమ తమ డివిజన్ లలో పార్టీ బలోపేతానికి కృషిచేయాలని తెలిపారు.

# గ్రామ యూత్ ఆధ్వర్యంలో సూర్య జన్మదిన వేడుకలు..





**వెంకటాపూర్ జూలై 26**
వెంకటాపూర్ మండలంలోని జవహర్ నగర్ గ్రామంలోని యూత్ అధ్యక్షుడు కోపెల కిరణ్ ఆధ్వర్యంలో మంత్రి సీతక్క కుమారుడు యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.

కోపెల కిరణ్ ఆధ్వర్యంలో సూర్య అనే అక్షరాలతో చేసిన కేకులను కట్ చేసి కుంజ సూర్యకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కిరణ్ మాట్లాడుతూ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క కుమారుడు కుంజ సూర్య జన్మదినాన్ని పురస్కరించుకొని మహా అన్నదానం చేయడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని, యువతకు ఆదర్శంగా నిలవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బట్టారి రాంప్రసాద్, ఆవాల హతీష్, త్రికోవేల మనోజ్, సామల వినోద్, సామల ప్రశాంత్, ఎం అజయ్, కొండారి రాజు, బానోత్ నవీన్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## క్షిపణుల కొరత..

(మొదటిపేజీ తరువాయి)

**సీమైన్‌ను ఢీకొని పేలిన చమురు ట్యాంకర్!**
తాము సూచించిన మార్గంలో కాకుండా ఒమన్ తీరానికి సమీపంగా హోర్ముజ్ జలసంధి దాటడానికి ప్రయత్నించిన ఒక చమురు ట్యాంకర్ సముద్ర మందుపాతర (సీమైన్)ను ఢీకొని పేలిపోయిందని ఇరాన్ వార్తా సంస్థ టాస్నిమ్ పేర్కొంది. అది ఏదేశ నౌక,ఎంతమేర దెబ్బతిన్నది,ప్రాణ నష్టమేదైనా జరిగిందా అన్న వివరాలేవీ వెల్లడించలేదు. దీనిపై ఇరాన్ రెవెల్యూషనరీ గార్డ్స్ (ఐఆర్‌జీసీ) నుంచి కూడా అధికారిక ప్రకటన ఏదీ రాలేదు.

**సౌదీ ఆరామ్‌కో రిఫైనరీపై హుతీల దాడి**
సౌదీ అరేబియాలోని ఆరామ్‌కో రిఫైనరీలపై యెమెన్‌కు చెందిన ఇరాన్ మద్దతున్న హుతి తిరుగుబాటుదారులు డ్రోన్ దాడులు చేశారు. ఎర్ర సముద్రతీరంలోని జిజాన్, యాంబు ప్రాంతాల్లో ఉన్న ఆరామ్‌కో చమురు కేంద్రాలపై దాడి చేశామని హుతీల సైనిక ప్రతినిధి యహ్యా సరియా ప్రకటించారు. జిజాన్‌లోని రిఫైనరీపై దాడి జరిగిందని, అక్కడ భారీగా పొగలు వెలువడుతున్నాయని రాయిటర్స్ వార్తా సంస్థ పేర్కొంది. యాంబు రిఫైనరీ వైపు దూసుకొచ్చిన రెండు బాలిస్టిక్ క్షిపణులను పేట్రియాట్ వ్యవస్థతో విజయవంతంగా అడ్డుకున్నట్టుగా గ్రీకు భద్రతా దళాలు వెల్లడించాయని తెలిపింది.

## నేటి నుంచి..(మొదటిపేజీ తరువాయి)

ప్రజలకు ఉపయోగపడేలా పాలన చేపడుతున్నాం. నిరంతరం ప్రజాభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటున్నాం. స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలూ గెలవాలి. టీడీపీ సహా కూటమి పార్టీల అభ్యర్థుల గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి. బూత్ కన్వీనర్లు సహా వివిధ పార్టీ హోదాల్లో పనిచేసిన వారు బాధ్యతతో పనిచేయాలి. ప్రజలు, కార్యకర్తలతో సన్నిహితంగా ఉండాలి. నాకు కావాల్సింది అనుచరులు కాదు పార్టీకి నాయకులు కావాలి. సమస్యలకు పరిష్కారం చూపగలిగే నైపుణ్యాలను అలవర్చుకోవాలి. లీడర్ షిప్ క్వాలిటీ పెంచుకోవాలి. డబ్బులు ఉన్నాయని, ఎలాగైనా గెలుస్తామనే ధీమాతో గొడ్డలి పార్టీ వ్యవహరించింది. కేవలం డబ్బులతోనే ప్రజాభిమానాన్ని పొందలేం. 2024 ఎన్నికలతో పాటు ఇటీవల జరుగుతున్న రాజకీయ పరిణామాలను గమనించాలి' అని చంద్రబాబు సూచించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు సారథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి, సంక్షేమ ఫలాలపై విస్తృత ప్రచారాన్ని చేపట్టాలని పార్టీ శ్రేణులకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ ప్రజాచైతన్య యజ్ఞం 45 రోజుల పాటు నిర్విరామంగా కొనసాగనుందన్నారు. ఈ కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులందరం కలిసి విజయవంతం చేద్దామని కోరారు. సూపర్-6 హామీల అమలు, మహిళలు, రైతులు, యువత, విద్యార్థులకు అందిన లబ్ధిని ప్రజలకు వివరించాలని కోరారు. ఒకే రాజధాని-అభివృద్ధి వికేంద్రీకరణ, ఉత్తరాంధ్ర, రాయలసీమలో జరుగుతున్న అభివృద్ధిని వివరించాలని సూచించారు. గత ప్రభుత్వ విధ్వంసక పాలనకు, ఎన్డీయే ప్రభుత్వ అభివృద్ధి పాలనకు మధ్య ఉన్న తేడాను ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలన్నారు. ప్రజల సమస్యలు, సూచనలను నమోదు చేసి వాటి పరిష్కారానికి పార్టీ,ప్రభుత్వం తరపున చర్యలు తీసుకునేలా కృషి చేయాలన్నారు.

## మహిళా రిజర్వేషన్..(మొదటిపేజీ తరువాయి)

ఆ తర్వాతైనా ప్రతిపక్షాలకు మోదీ కొంత గౌరవం ఇస్తారని, పార్లమెంట్‌లో చర్చకు అవకాశం కల్పిస్తారని భావించామని.. కానీ వారి వైఖరి మారలేదని చెప్పారు. అనేక ప్రవేశ, నియామక పరీక్షల నిర్వహణలో కేంద్రం పూర్తిగా విఫలమైందని.. ప్రతిపక్షాల సూచనలు, హెచ్చరికలను పట్టించుకోలేదని మండిపడ్డారు. పైగా ఈడీ, ఐటీ, సీబీఐ వంటి కేంద్ర సంస్థలను ఉపయోగించి ప్రతిపక్షాలను బెదిరించడం, ఒత్తిడి తేవడం కొనసాగించిందని మండిపడ్డారు. ఇప్పుడు దేశ యువత గల్లీ నుంచి పార్లమెంటు వరకు బలాన్ని చూపడంతో 56 అంగుళాల ఛాతీ నిలబడలేక పోయిందని రేవంత్‌రెడ్డి చెప్పారు. ప్రతిపక్షాలు, మిత్రపక్షాల సూచనలు పట్టించుకోకుంటే యువత వీధుల్లోకి వచ్చేస్తుందని, ప్రభుత్వానికి ప్రజలు ఎదురుతిరుగుతారని మోదీ సర్కారుకు ఇప్పుడు అర్థమైందని పేర్కొన్నారు. కేవలం వికసిత్ భారత్, సబ్‌కా సాథ్-సబ్‌కా వికాస్ వంటి నినాదాలతోనే దేశ అభివృద్ధి జరగదని.. యువశక్తిని సరైన దిశలో నడిపించి, దేశ భవిష్యత్తును నిర్మించాలని స్పష్టం చేశారు. స్వాతంత్ర్యం వచ్చిన సమయంలో అప్పటి పరిస్థితులను బట్టి శాసనసభ, లోక్‌సభ ఎన్నికల్లో పోటీకి 25 ఏళ్లు, శాసనమండలి, రాజ్యసభకు 30 ఏళ్లను కనీస వయసుగా నిర్ణయించారని సీఎం రేవంత్ గుర్తు చేశారు. కానీ ఇప్పుడు పరిస్థితులు మారాయని.. అందరికీ విద్య అందుబాటులోకి వచ్చిందని, ప్రజల్లో అవగాహనా శక్తి పెరిగిందని చెప్పారు. మన యువత ప్రతి నిమిషం కొత్త విషయాలు నేర్చుకుంటూ ప్రపంచాన్ని గమనిస్తోందని, దేశ నిర్మాణంలో భాగస్వామ్యం కావడానికి సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. "ఇప్పుడు 21 ఏళ్ల వయసున్న యువత ఐఏఎ?సలు, ఐపీఎ?సలు అవుతున్నారు. యూనికార్న్ కంపెనీలు స్థాపిస్తున్నారు. ఫార్చ్యూన్-500 కంపెనీలకు సీఈఓలుగా బాధ్యతలు చేపడుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా తమ ప్రతిభ, జ్ఞానం, సామర్థ్యాన్ని నిరూపిస్తున్నారు. అలాంటి యువతకు రాజకీయాల్లో నాయకత్వం వహించే అవకాశం ఎందుకు ఇవ్వకూడదు? కాలానుగుణంగా చట్టాలను మార్చాల్సిన అవసరం ఉంది. ఇప్పటివరకు రోడ్లపై పోరాటం చేసిన యువత.. ఇకపై పార్లమెంట్‌లోకి వచ్చి దేశ భవిష్యత్తును నిర్ణయించాలనుకుంటోంది. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా నాదొక సూచన. ఈ అంశంపై లోతుగా ఆలోచించండి. దేశ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని చట్టం చేయండి" అని ప్రధాని మోదీని సీఎం రేవంత్ కోరారు. యువతను రాజకీయ వ్యవస్థలో భాగస్వామ్యం చేస్తే.. దేశ భవిష్యత్తు మారుతుందని, ప్రపంచంలోనే శక్తివంతమైన దేశంగా భారత్ ఎదుగుతుందని చెప్పారు. ఈ అంశంపై దేశవ్యాప్తంగా చర్చ జరగాల్సిన సమయం వచ్చిందని తాను భావిస్తున్నానన్నారు. లోక్‌సభ, శాసనసభలకు పోటీచేసే కనీస వయసును 21 ఏళ్లకు తగ్గించే అంశంపైన సమగ్రంగా చర్చించేందుకు ఆగస్టులో రాష్ట్ర శాసనసభ, మండలి సమావేశాలను ఏర్పాటు చేస్తామని రేవంత్ చెప్పారు. ప్రతిపక్షాల అభిప్రాయం కూడా తీసుకుంటామని తెలిపారు. పోటీ కనీస వయసును శాసనసభ, లోక్‌సభలకు 21 ఏళ్లకు, శాసనమండలి, రాజ్యసభలకు 25 ఏళ్లకు తగ్గించాలని తీర్మానం చేస్తామని.. దేశానికి ఒక సందేశం ఇస్తామని వెల్లడించారు. బీజేపీ ప్రభుత్వాన్ని ఎవరైనా విమర్శిస్తే.. దేశాన్నే విమర్శిస్తున్నారంటూ, అర్బన్ నక్సల్స్, విదేశీ శక్తుల హస్తం ఉందంటూ ఆరోపణలు చేయడం ఆ పార్టీకి అలవాటుగా మారిందని సీఎం రేవంత్ మండిపడ్డారు. మన్ కీ బాత్ పేరుతో రేడియోలో మాట్లాడటం కాదు.. ఇప్పుడు ప్రధాని మోదీ ప్రజల మాట వినాల్సిన సమయం వచ్చిందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ కూడా 'జై జవాన్- జై కిసాన్' నినాదానికి 'జై యువత'ను కూడా జోడించాల్సిన సమయం వచ్చిందన్నారు.

## ఘనంగా సీతక్క కుమారుడి జన్మదిన వేడుకలు



**ములుగు జూలై 26**
ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం లోని జవహర్ నగర్ కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క కుమారుడు,యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజ సూర్య జన్మదిన వేడుకల్లో బాణాసంచా కాలుస్తూ,గ్రామ అధ్యక్షుడు కేక్ కట్ చేసి కుంజ సూర్యకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రవీందర్ రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని యువతలో స్ఫూర్తిని నింపుతూ మంత్రి సీతక్క ఆశయాలను నెరవేరుస్తూ యువతకు ఆదర్శంగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ తిరుపతి కృష్ణ, వెంకటాపూర్ మహిళా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు రుద్రారపు మమత, రైతు కమిటీ ఉపాధ్యక్షుడు పిట్ట రామలింగం ఆత్మ డైరెక్టర్ వాంకుడోత్ లక్ష్మి, తిరుపతి కల్పన, గ్రామ యూత్ ఉపాధ్యక్షుడు గొప్ప రాకేష్, వార్డు సభ్యురాలు సుశీల, భాగ్య, సునీత,ఉమా,సుజాత, నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఇది నాకు కొత్త సబ్జెక్టు: ప్రహ్లాద్ జోషి

### విద్యాశాఖ మంత్రిగా బాధ్యతల స్వీకరణ

న్యూఢిల్లీ, జూలై 26: కేంద్ర విద్యాశాఖ మంత్రిగా ప్రహ్లాద్ జోషి ఆదివారం అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా రంగం తనకు కొత్త సబ్జెక్టు అని, పూర్తి బాధ్యతతో పనిచేస్తానని అన్నారు. ప్రస్తుతం శాఖలో తీసుకోవాల్సిన నిర్ణయాలపై సమీక్షిస్తున్నట్లు చెప్పారు. బాధ్యతలు చేపట్టిన వెంటనే అధికారులతో వరుస సమావేశాలు నిర్వహించి, విధివిధానాలపై చర్చించామని జోషి వివరించారు. 'ఇది చాలా పెద్ద శాఖ, దీని పనితీరుపై పూర్తి అవగాహన వచ్చిన తర్వాతే వివరంగా మాట్లాడతా' అని జోషి పేర్కొన్నారు. కాగా, తనపై పూర్తి నమ్మకంతో విద్యాశాఖ బాధ్యతలను అప్పగించిన ప్రధాని మోదీకి ఆయన 'ఎక్స్'లో కృతజ్ఞతలు తెలిపారు. ఎంతో వినయంతో, బాధ్యతా భావనతో ఈ పదవిని స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం జోషి కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజాపంపిణీ, నూతన, పునరుత్పాదక ఇంధన శాఖల మంత్రిగా వ్యవహరిస్తున్నారు. గతంలో ఆయన బొగ్గు, గనులు, పార్లమెంటరీ వ్యవహారాల శాఖల మంత్రిగా పనిచేశారు.

## గంగా నదిపై చికెన్ తినడం నేరమా?

### అలా అని ఏ చట్టమూ చెప్పడం లేదే

### సుప్రీంకోర్టు జస్టిస్ ఉజ్వల్ భుయాన్ వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ, జూలై 26:**
పవిత్ర గంగానదిపై చికెన్ తిన్న అంశంలో సుప్రీంకోర్టు జస్టిస్ ఉజ్వల్ భుయాన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అంతేకాదు, గాజా ఊచకోతలపై నిరసనల హక్కును హరించడాన్ని కూడా తప్పుబట్టారు. "గంగా నదిపై చికెన్ తినడం నేరం ఎలా అవుతుంది. దాన్ని ఏ చట్టమూ నిషేధించ లేదు. అయినప్పటికీ వారిని అరెస్ట్ చేసి, మూడు నెలల పాటు బెయిల్ నిరాకరించొచ్చా?అని నన్ను నేనే ప్రశ్నించుకుంటున్నా"అని జస్టిస్ భుయాన్ పేర్కొన్నారు. వారణాసిలో గంగానదిపై బోటును నడిపించే సిబ్బంది, రంజాన్ ఉపవాసం ముగిసిన తర్వాత అందులోనే చికెన్ తిన్న ఘటనలో, యూపీ పోలీసులు 14 మందిని అరెస్ట్ చేశారు. శనివారం భోపాల్‌లోని నేషనల్ లా ఇనిస్టిట్యూట్ యూనివర్సిటీ (ఎన్ఎల్ఐయూ) కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా జస్టిస్ ఉజ్వల్ భుయాన్ దీనిపై స్పందించారు. ప్రాథమిక హక్కులను వినియోగించుకున్నా, నేరపూరిత చర్యలతో పౌరులను వేధిస్తున్న క్రమాన్ని ఈ ఘటన(చికెన్ తిన్న) తెలియజేస్తోందన్నారు. మానవ హక్కుల ఉల్లంఘనలపై నిరసనలు వ్యక్తం చేసే పౌరుల హక్కులనూ హరిస్తుండడంపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. "గాజా ప్రజలకు సంఘీభావంగా ముంబైలోని శివాజీపార్క్‌లో ఓ వర్గం ప్రజలు నిరసనలు వ్యక్తం చేసేందుకు ప్రభుత్వం అనుమతివ్వలేదు. దీంతో వారు బాంబే హైకోర్టును ఆశ్రయించారు" అని గుర్తు చేశారు.

## ఇది ఆరంభమే..

(మొదటిపేజీ తరువాయి)

ప్రధాన్ శనివారం రాజీనామా చేయడంతో ఉద్యమ ప్రధాన డిమాండ్ నెరవేరింది. దీంతో, కాక్రోచ్‌ల తదుపరి కార్యాచరణ ఏమిటనే ఆసక్తి అందరిలో నెలకొంది. దీనిపై దీప్కే ఆదివారం స్పందించారు. ఉద్యమం నడిచినన్ని రోజులూ బాగా ఒత్తిడికి గురయ్యానని, సమయం కష్టంగా గడిచేదని 'ఎక్స్'లో తెలిపారు. "రాత్రి (ఆదివారం) నా గదిలో ప్రశాంతంగా నిద్రపోయాను. రేపు ఏమవుతుందో, సాయంత్రం వరకు ఎలా గడుస్తుందోననే ఆందోళన తొలగిపోయింది." అని పేర్కొన్నారు. ఉద్యమకాలంలో తనకు మద్దతుగా దేశం నలమూలల నుంచి వచ్చి.. చివరిదాకా వెంట నిలబడిన మద్దతుదారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యమాన్ని విమర్శించినవారికి కూడా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మరింత మెరుగ్గా పనిచేసేందుకు వారి విమర్శలు తమకు దోహదపడ్డాయన్నారు. "ఇది మనకు (మద్దతుదారులను ఉద్దేశించి) ఆరంభమే. ఉద్యమం మొదలైన నాటినుంచీ నేను మీకిదే చెబుతున్నా. కాక్రోచ్ జనతా పార్టీ ఇంకా చాలానే ప్రయాణం చేయాల్సి ఉంది." అని తెలిపారు. ప్రధాన్ రాజీనామా తర్వాత జంతర్‌మంతర్‌లో తన కోసం వేచిచూసిన వారిని కలుసుకొని, కృతజ్ఞతలు తెలపలేకపోయానని, ఇందుకు తనను క్షమించాలని దీప్కే కోరారు. టైఫాయిడ్ సోకి, 101 డిగ్రీల జ్వరం తగలడంతో తాను ఇంటికి తిరిగొచ్చేశానని తెలిపారు.